www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -142 శుక్రవారం 2 ఆగష్టు 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

# స్కిల్ యూనివర్సిటీకి

## సీఎం రేవంత్ శంకుస్థాపన



**మహాద్భుతంగా కొత్త నగరం**

**భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు అండగా ప్రభుత్వం : సీఎం రేవంత్‌రెడ్డి**

**చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం**

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి భూమిపూజ చేసిన సీఎం**



రంగారెడ్డి ఆగస్టు1, ప్రజావినికిడి:


బేగరకంచ కేంద్రంగా మహానగరాన్ని అద్భుతంగా నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కందుకూరు మండలం మీర్ఖాన్‌పేట్‌లోని బేగర కంచలో సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, మోడరన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్లకు ఆయన గురువారం సాయంత్రం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నెట్ జీరో సిటీ కోసం భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు అండగా ఉంటామని, మీ త్యాగాలకు తగిన ఫలితం ఉంటుందని భరోసా ఇచ్చారు. మీ తాత ముత్తాల భూములు ఈ ప్రాజెక్టు కోసం ఇచ్చారని, మీ కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా భద్రతగా ఉంటానని సీఎం తెలిపారు

మిగతా 2లో.

# అదరగొట్టిన స్వప్నిల్

**షూటింగ్‌లో కాంస్యం**

**ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం**



హైదరాబాద్ ఆగస్టు1 ప్రజావినికిడి:

పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా జరుగుతు న్న ఒలింపిక్స్‌లో భారత్ మూడో పతకం సాధించింది. గురువారం షూటింగ్‌లో భారత యువ షూటర్ స్వప్నిల్ కుశాలె కాంస్య పతకం గెలుచుకున్నాడు. దీంతో ఈ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది. భారత్ సాధించిన మూడు పతకాలు కూడా షూటింగ్‌లోనే లభించడం విశేషం.

# ఇది జాతీయ విపత్తు

**: వయనాడ్‌లో రాహుల్, ప్రియాంక పర్యటన**

2లో.

## మహిళా ఎమ్మెల్యేలపై సీఎం వ్యాఖ్యలపై నిరసన..

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్..

-సబితకు క్షమాపణ చెప్పాలని సీఎం ఛాంబర్ వద్ద నినాదాలు

-కేటీఆర్, హరీశ్ రావులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

-బీఆర్ఎస్ కార్యాలయం వైపు తరలింపు

2లో.





## ఎస్సీ వర్గీకరణ తీర్పుపై

# సంబురాలు

## రేవంత్ కు అభినందనలు



2లో.

# ఎస్సీ , ఎస్టీల వర్గీకరణకు

# గ్రీన్ సిగ్నల్



## సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం!

- గత ధర్మాసనం తీర్పు తోసివేత
- సుప్రీం కోర్టు సంచలన తీర్పు
- కేసు ఒకటే, తీర్పులు ఆరు..
- నిర్ణయం మాత్రం ఏకాభిప్రాయం
- 6 : 1 నిష్పత్తిలో జడ్జీల నిర్ణయం
- 30 ఏళ్ల పోరాట ఫలితం
- చంద్రబాబు, మోదీకి కృతజ్ఞతలు
- మంద కృష్ణ మాదిగ భావోద్వేగం

## ఉపకులాలు ఒకే సమూహం కాదు

మిగతా 2లో.

**ఆగస్టు1, ప్రజావినికిడి:** షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం రిజర్వేషన్ కోటాను రాష్ట్రాలు విభజించవచ్చని గురువారం కీలక తీర్పునిచ్చింది. ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనంలో జస్టిస్ బేలా త్రివేది మాత్రమే విభేదించగా మిగిలిన ఆరుగురు ఉపవర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల్లో ఉప కులాలను 'హెూమోజీనస్ క్లాస్' (ఒకే సమూహంగా భావించలేమని) కాదని, వారి జనాభా గణాంకాలు, సామాజిక ఆర్థిక పరిస్థితుల వంటి డేటా ఆధారంగా రాష్ట్రాలు వర్గీకరించవచ్చని జస్టిస్ చంద్రచూడ్ తన తీర్పులో పేర్కొన్నారు.



2లో.

## కొత్త రేషన్ కార్డుల జారీకి

# కేబినెట్ ఆమోదం

**రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర కేబినెట్**

**ఉత్తమ్ అధ్యక్షతన కొత్త రేషన్ కార్డులపై కేబినెట్ సబ్ కమిటీ**

**రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు విడిగా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం**

**కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన పొంగులేటి**

# ఎస్సీ, ఎస్టీల వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజి తరువాయి)

కేసు ఒకటి.. ఆరు తీర్పులు, నిర్ణయమూ ఒకటే జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ బీఆర్ గవై, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీశ్ చంద్ర మిశ్రా సభ్యులుగా ఉన్నారు. వీరు ఈ కేసులో ఆరు తీర్పులను విడివిడిగా ఇచ్చారు. ఉప వర్గీకరణకు అనుకూలంగా జస్టిస్ మిశ్రాకు, తనకు కలిపి సీజేఐ ఒక తీర్పు రాశారు. మిగిలిన నలుగురు ఇదే వైఖరితో నాలుగు తీర్పులు విడివిడిగా ఇచ్చారు. వీరిలో ఒకరైన జస్టిస్ బీఆర్ గవై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీ లేయర్?ను గుర్తించి, వారిని రిజర్వేషన్ పరిధి నుంచి తప్పించాలని సూచించారు. జస్టిస్ బేలా త్రివేది మాత్రం ఉపవర్గీకరణకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. మెజారిటీ తీర్పుతో తాను విభేదిస్తున్నానని, రాజ్యాంగంలోని 341వ అధికరణ కింద నోటిఫై చేసిన ఎస్సీ జాబితాను మార్చే అధికారం రాష్ట్రాలకు లేదని ఆమె అభిప్రాయపడ్డారు.

## కేంద్రం వాదన ఇదీ!

ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకు తెలిపింది.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గీకరణతో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడింది. అప్పుడే ప్రభుత్వాలు సరైన పథకాలు రూపొందించగలవని తెలిపింది. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే కల ఉపవర్గీకరణతో సాకారం అవుతుందని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు తీసుకురావడం వెనుకున్న లక్ష్యం చేరుకోవాలంటే కోటా హేతుబద్ధీకరణ చాలా ముఖ్యమని వివరించారు.

## పంజాబ్ నుంచి ఆంధ్ర ప్రదేశ్ వరకూ..

వాల్మీకీలు, మఝాబీ సిక్కులకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పంజాబ్ ప్రభుత్వం తెచ్చిన నిబంధనను 2010 లో పంజాబ్, హరియాణా హైకోర్టు కొట్టివేసింది. అయితే ఈ తీర్పును సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఎస్టీ కోటాలో ఉప వర్గీకరణలు రాజ్యాంగంలోని 14వ అధికరణకు విరుద్ధమని 2004లో 'ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును ఆధారంగా చేసుకుని పంజాబ్ సర్కారు నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అయితే, హైకోర్టు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 2011లో పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 2020లో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టింది. దీనిపై పునఃసమీక్ష కోసం ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి కేసును బదిలీ చేసింది. ఇప్పుడు ఉపవర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

## సప్త సభ్యుల విచారణ..

ఎస్సీ వర్గీకరణపై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేస్తూ సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు జడ్జిలతో కూడిన ధర్మాసనం నిర్ణయించింది. పంజాబ్ ప్రభుత్వం ఇప్పటికే ఎస్సీ వర్గీకరణపై భారత అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. పంజాబ్ గవర్నమెంట్ వేసిన పిటిషన్‌ను ప్రధాన పిటిషన్‌గా స్వీకరిస్తూ సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. వర్గీకరణకు అనుకూలంగా, వ్యతిరేకంగా దాఖలైన పలు పిటిషన్లను కూడా విచారించింది. అయితే.. వర్గీకరణపై దాఖలైన అన్ని పిటిషన్లను పంజాబ్ పిటిషన్‌కు న్యాయస్థానం జత చేసి విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లలో ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణకు రాష్ట్ర మంత్రి దామోదర రాజ నరసింహ హాజరయ్యారు.




## అసెంబ్లీలు ఆలోచించాలి

విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్ని ప్రశ్నలను సంధించింది. అసమానతలను తొలగింపునకు ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. వర్గీకరణకు రాష్ట్ర శాసనసభలు సిద్ధంగా ఉన్నాయా అంటూ వివరణ కోరింది. ఈ కేసు విచారణలో భాగంగా అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను రాజ్యాంగ ధర్మాసనం తెలుసుకోనుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు.

## ఇరవై ఏళ్ల కిందటే .. సవరణకు నాందీ

2004లో చంద్రబాబు సర్కారు కల్పించిన వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టేసిన విషయం తెలిసిందే. అయితే వర్గీకరణకు రాజ్యాంగ సవరణ చేయాలని ఉషా మెహ్రా కమిషన్ స్పష్టం చేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులను ఇచ్చింది. కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులను ఇచ్చింది. ఈ కమిటీలో కేంద్ర హోంశాఖ, గిరిజన, న్యాయశాఖ, సామాజిక న్యాయ శాఖల కార్యదర్శులు ఉన్నారు. ఈ విషయాలను అన్నింటిని పరిగణలోకి తీసుకున్న సీజేఐ నేతృత్వంలోని ఏడుగురు జడ్జిలతో కూడిన ధర్మాసనం విచారణను చేపట్టి ఎస్సీ వర్గీకరణపై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. తెలంగాణ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నెరవేర్చారు.

## ఇది 30 ఏళ్ల పోరాట ఫలితం : మంద కృష్ణ మాదిగ

సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ భావోద్వేగానికి గురయ్యారు. మీడియా ఎదుటే ఆయన కంటనీరు పెట్టుకున్నారు. 'మా 30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగింది. సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని బతికించింది. ఈ ప్రక్రియ వేగవంతానికి ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకున్నారు. అమిత్‌షా, వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు. వర్గీకరణ చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ విజయాన్ని అమరులకు అంకితం ఇస్తున్నాం. రిజర్వేషన్ల సిస్టమ్ ఇప్పుడు రెండో అడుగు వేయబోతుంది. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ అనివార్యం. వర్గీకరణకు సంబంధించిన జీవోలు వచ్చిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి. ఉద్యోగ నోటిఫికేషన్లు సరిచేసుకోవాల్సిన అవసరం ఉంది. రీ-నోటిఫికేషన్లు ఇవ్వాలి' అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మందకృష్ణ మాదిగ కోరారు. వర్గీకరణకు జనాభా లెక్కలతో పనిలేదని మరోసారి గుర్తు చేశారు. త్వరలో విజయోత్సవ సభ నిర్వహిస్తాం అని మందా కృష్ణ మాదిగ అన్నారు.

# స్కిల్ యూనివర్సిటీకి సీఎం రేవంత్ శంకుస్థాపన

హైదరాబాద్ ఆగస్టు1 ప్రజావినికిడి:

. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి స్కిల్ డెవల్‌పమెంట్ యూనివర్సిటీ వరకు 200 ఫీట్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్న రహదారుల పనుల పర్యవేక్షణను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి అప్పగిస్తున్నట్లు చెప్పారు. అలాగే రీజనల్ రింగ్‌రోడ్డు భూ సేకరణ బాధ్యతను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అప్పగిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భూములు కోల్పోయిన కుటుంబాలకు అండగా ఉంటామని, చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ భూములు కోల్పోయిన కుటుంబాల్లో చదువుకున్న యువతకు శిక్షణను ఇప్పించి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. పదేళ్లు బీఆర్‌ఆర్‌ఎస్ పాలనలో గమ్యం తెలియక యువత పోరాటాలు చేసి తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదింప చేసుకుని ఇక్కడ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని చెప్పారు. ఫార్మాసిటీ ఏర్పాటైతే ఈ ప్రాంతంలో కలుషిత పరిశ్రమలతో మానవాళి మనుగడగే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండేదన్నారు. అలా కాకుండా మార్పును తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని ఓ మహా నగరంగా తీర్చిదిద్దేందుకు పూనుకున్నామని, ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. నెట్‌జోన్ సిటీగా ఉపాధినిచ్చే పరిశ్రమలే కాకుండా స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, ఆధునిక సౌకర్యాలతో కాలనీలు ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. పరిశ్రమలకు సంబంధించిన నైపుణ్యం యువతలో లేదనే విషయాన్ని గుర్తించి ఇక్కడ నైపుణ్యాన్ని పెంచే విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నోటిఫికేషన్లు ఇచ్చామని, 40వేల మంది యువతకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఇంజనీరింగ్, డిగ్రీలు పీజీలు చేసి 30లక్షల మంది యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, నైపుణ్యం లేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయిచామని, ఈ స్థలంలో కార్పొరేట్ స్కూల్, ఆసుపత్రి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. నాట్కో సంస్థ ఇక్కడ స్కూల్ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు.ఏడాదిలో లక్ష మందికి శిక్షణ ఇవ్వబోతున్నామని ఐఎసబీ ఫౌండర్ శ్రీ సిటీ అధినేత శ్రీని రాజు అన్నారు. మూడు వారాల క్రితం వ్యాపారవేత్తలతో సమావేశమై సీఎం మూడు వారాల్లోనే ఇక్కడ అద్భుత ప్రాజెక్టుకు రూపకల్పన చేయడం అద్భుతమైన విషయమన్నారు.

# ఇది జాతీయ విపత్తు

## : వయనాడ్‌లో రాహుల్, ప్రియాంక పర్యటన

వయనాడ్(కేరళ): ఆగస్టు1 ప్రజావినికిడి:

వయనాడ్‌ను అతలాకుతలం చేసిన కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలను జాతీయ విపత్తుగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఈ ఘోర దుర్ఘటనలో కుటుంబ సభ్యులను, ఇళ్లను కోల్పోయిన వారి ఆవేదన వర్ణాతీతమని ఆయన అన్నారు. గురువారం తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రతో కలసి ఆయన వయనాడ్‌లోని ప్రకృతి బీభత్సానికి గురైన ప్రాంతాలను సందర్శించారు. ఇది వయనాడ్‌కు, కేరళకు, యావద్ దేశానికే ఘోర దుర్ఘటనని ఆయన పేర్కొన్నారు.

తన దృష్టిలో ఇది జాతీయ విపత్తని, అయితే ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలని విలేకరులతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. వయనాడ్‌లోని చూల్‌మల ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఇక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా చూసేందుకే తాము వచ్చామని, ప్రజలు తమ కుటుంబ సభ్యులను, ఇళ్లను కోల్పోవడం చాలా విచారకరమని రాహుల్ అన్నారు. బాధితులను ఎలా ఓదార్చాలో తనకు అర్థం కావడం లేదని, ఈ పరిస్థితిలో వారిని పలకరించడం కూడా చాలా కష్టమని ఆయన తెలిపారు. ఇది తనకు అత్యంత



కష్టమైన రోజని, ఈ విపత్తు నుంచి ప్రాణాలతో బయటపడినవారిని ఆదుకోవడానికి తన వంతు కృషి తాను చేస్తున్నానని ఆయన తెలిపారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు వచ్చిన కష్టం ఎవరూ ఊహించనిదని అన్నారు. వారిని ఆదుకుని వారికి అండగా నలిబడడేందుకు ప్రయత్నిస్తున్నామని ఆమె చెప్పారు.మేప్పాడిలోని ఆసుపత్రిని, కమ్యూనిటీ హెల్త్ సెంర్‌ను, రెండు సహాయ శిబిరాలను రాహుల్, ప్రియాంక సందర్శించారు. ఈ కష్టకాలంలో వయనాడ్ ప్రజలకు అండగా తాను, ప్రియాంక నిలబడతామని, సహాయ, రక్షణ, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నామని, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందచేస్తున్నామని రాహుల్ తెలిపారు. బాధితులకు అండగా యుడిఎఫ్ నిలబడుతుందని ఆయన చెప్పారు. వరుసగా జరుగుతున్న కొండ చరియలు విరిగిపడిన ఘటనలు, ప్రకృతి విపత్తులు చాలా ఆందోళన కలిగిస్తున్నాయని, ఇందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తక్షణ అవసరమని ఎక్స్ పోస్టులో రాహుల్ పేర్కొన్నారు. చూరల్‌మలను చేరుకున్న అనంతరం రాహుల్, ప్రియాంక రెయిన్‌కోట్లు ధరించి తాత్కాలికంగా నిర్మించిన చెక్క వంతెనపై నుంచి నడిచి కొత్తగా నిర్మిస్తున్న బెయిలీ వంతెనను తిలకించారు.బురదతో నిండిపోయిన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మేప్పాడిలోని డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి అక్కడ రిశీతల పేటికలలో భద్రపరిచిన మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట అళప్పుళ ఎంపి, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ఇతర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. 2019లో వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన రాహుల్ 2024 ఎన్నికలలో కూడా ఇక్కడి నుంచి గెలుపొందారు. అయితే రెండు స్థానాలలో పోటీ చేసిన రాహుల్ రాయ్‌బరేలి స్థానాన్ని ఉంచుకుని వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు.

## మహిళా ఎమ్మెల్యేలపై సీఎం వ్యాఖ్యలపై నిరసన..

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్..

హైదరాబాద్ ఆగస్టు1 ప్రజావినికిడి:

తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఛాంబర్ ఎంట్రన్స్ వద్ద ఆందోళన చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిన్న సబితా ఇంద్రారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వారు సీఎం ఛాంబర్ వద్ద ఆందోళనకు దిగారు. సబితకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

ఈ ఆందోళనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, తదితరులు పాల్గొన్నారు.కేటీఆర్ సహా ఎమ్మెల్యేలను అసెంబ్లీ మార్షల్స్ బలవంతంగా బయటకు తీసుకువచ్చారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి... బీఆర్ఎస్ భవన్ వైపు తీసుకువెళ్లారు.

పోలీసులు అరెస్ట్ చేసిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ... ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పే వరకు వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా, అగౌరవంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా ఎమ్మెల్యే పట్ల అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా ఈ రోజు నిరసన తెలుపుతున్న తమను అరెస్ట్ చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీకి కేబినెట్ ఆమోదం

హైదరాబాద్ ఆగస్టు1 ప్రజావినికిడి:

కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని తెలంగాణ కేబినెట్ గురువారం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశమై... పలు నిర్ణయాలు తీసుకుంది.

కొత్త రేషన్ కార్డుల జారీ విధివిధానాల రూపకల్పనకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు విడిగా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

గౌరవెల్లి ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.437 కోట్లు విడుదల చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీలో శుక్రవారం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. క్రీడాకారులు ఈషాసింగ్, నిఖత్ జరీన్, సిరాజ్‌లకు 600 గజాల చొప్పున హైదరాబాద్‌లో ఇంటి స్థలం, నిఖత్ జరీన్, సిరాజ్‌లకు గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించిందన్నారు.విధుల్లో చనిపోయిన రాజీవ్ రతన్ తనయుడికి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం, మరో అధికారి మురళి కుమారుడికి గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇద్దరు ఎమ్మెల్సీల నియామకంపై మళ్లీ గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపించాలని నిర్ణయించామన్నారు. నిజాం చక్కెర పరిశ్రమ పునరుద్ధరణ, హైదరాబాద్ మూసీ సుందరీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబురాలు రేవంత్ కు అభినందనలు

హైదరాబాద్ ఆగస్టు1, ప్రజావినికిడి:

రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును స్వాగతించి, తెలంగాణలో వెంటనే అమలు చేస్తామని ప్రకటించేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు, ఎమ్మెల్యేలు కృతజతలు తెలియజేశారు. శాసనసభలోని సీఎం కార్యాలయంలో స్వీట్లు తినిపించుకుని సంబురాలు జరుపుకొన్నారు.సీఎంను కలిసినవారిలో సీనియర్ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మందుల సామేల్, కడియం శ్రీహరి, తోట లక్ష్మీకాంతరావు, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలే యాదయ్య, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.%అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు సైతం డప్పు దరువులతో వచ్చి ముఖ్యమంత్రిని కలిసి వర్గీకరణ సంబురాలు పంచుకొని, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
శుక్రవారం 2 ఆగష్టు 2024

## అనాధాశ్రమంలో పిల్లలకు పండ్లు పంపిణీ



ప్రజావినికిడి,(అంబర్ పేట్): తెలంగాణ బిసి విద్యార్థి విభాగం నాయకుడు అంబర్పేట్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ రాజశేఖర్ గంగపుత్ర జన్మదినం సందర్భంగా విద్యానగర్ టిఆర్టి క్వార్టర్స్ లో గల అనాదాశ్రమంలో పిల్లలకు పండ్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్ గంగపుత్ర మాట్లాడుతూ అనాధ పిల్లలను సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దే కార్యక్రమం ప్రభుత్వం చేపెట్టాలన్నారు. పేద పిల్లలందరికీ ఉచిత విద్య, పీజీ వరకు అందించే విధంగా ప్రభుత్వ విద్యా విధానంలో నిర్మాణం ఉండాలన్నారు. పేద కుటుంబాలకు, పేద పిల్లలకు ఉచిత విద్య నాణ్యమైన ఆరోగ్య భద్రత కల్పించినప్పుడే తెలంగాణ ఆరోగ్య తెలంగాణగా, భారతదేశ నిర్మాణ తెలంగాణగా అవతరిస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో అనిల్, సాయి,ఉదయ్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి..



ప్రజావినికిడి, (నాంపల్లి): టీఎన్జీవో యూనియన్, కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.ఎన్. హుస్సేని (ముజీబ్) తనయుడు సయ్యద్ అసదుద్దీన్,వారి బంధువులు సయ్యద్ నవాజుద్దీన్, మొహమ్మద్ బిలాలుద్దీన్ పవిత్ర పుణ్య క్షేత్రంసౌదీ అరేబియాలో ఉమ్రా చేసి క్షేమంగా హైదరాబాదకు తిరిగి వచ్చిన శుభ సందర్భంలో హైదరాబాద్ జిల్లా పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. డా:ముజీబ్ మాట్లాడుతూ పవిత్ర మక్కా మదీనా సందర్శించిన తన సుపుత్రుదు, బంధువులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని,నూతన ప్రభుత్వం అన్ని సాంఘిక సంక్షేమ కార్యక్రమంలో భారత దేశంలో మొదటి స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఉద్యోగులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని,తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో అన్ని రంగాలలో ముందుకు పోవాలని అల్లాను కోరుకున్నామని సయ్యద్ అసదుద్దీన్ తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రంలో ఈసారి జరిగిన బోనాల ఉత్సవాలు 2024 కని విని ఎరుగని రీతిలో ..





ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
తెలంగాణ రాష్ట్రంలో ఈసారి జరిగిన బోనాలు ఉత్సవాలు 2024 లో,కనివిని ఎరుగని రీతిలో జరిగాయి.శ్రీ మహంకాళి అమ్మ ,వార్లకు మహిళా సోదరీమణులు బోనంతో అమ్మవారికే నైవేద్యం సమర్పించి ,ఆ అమ్మవారి,దయవల్ల, ప్రజలందరూ,సుఖ సంతోషాలతో,ఉండాలని,వర్షాలు కురవాలని పంటలు బాగా పండాలని భవిష్యత్తులో ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండాలని కోరుకున్నారు. ఈ బోనాల పండుగ సందర్భంగా నూతన కాంగ్రెస్ ప్రభుత్వం నుండి,ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. ఈసారి బోనాల పండుగలో ఏర్పాట్లకు వివిధ శాఖల అధికారులు,తమ వంతు,బాధ్యతలు నిర్వహించినందుకు,భక్తులకు ఇలాంటి లోపాలు లేకుండా ఏర్పాటు చేశారు. వివిధ దేవాలయల అధ్యక్షులు,వారి కమిటీ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ కైలాష్ అధ్యక్షులు,కె .ఎస్ ఆనందరావు వర్కింగ్ ప్రెసిడెంట్,శ్రీ,మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయం మరియు శ్రీ కోట మైసమ్మ దేవాలయం గౌలిపుర భాగ్యనగర్.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం
## : శంభీపూర్ క్రిష్ణ...



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు,కాలనీ సభ్యులు గురువారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

## ప్రభుత్వ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి..



ప్రజావినికిడి, (ముషీరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు చేపట్టాలి అని మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తెలంగాణ లెక్చరర్ ఫోరం అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి హాజరై మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్ లలో పనిచేసే ఉపాధ్యాయులు 11 సంవత్సరాలుగా తమ విధులు నిర్వహిస్తూ కుటుంబాలకు సైతం దూరం అవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి సమస్య పరిష్కారానికి సానుకూలంగా ఉందని తెలిపారు. 15 మంది ఉపాధ్యాయుల కోసం 3000 ఉపాధ్యాయుల పోస్టుల ట్రాన్స్ఫర్ ని నిలిచాయి. ఈ ట్రాన్స్ఫర్లకు ప్రభుత్వము, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పక్షాన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల సమస్యలపై తాము హామీ ఇస్తున్న అంటూ వెల్లడించాడు. కోర్టు కేసు కు సంబంధించిన విషయం పై ఏ జి తో మాట్లాడి కేసులు ఉపసంహరించే విధంగా కృషి చేస్తాను అని అన్నారు. జేఏసీ నాయకులు అరవింద్ గోష్,సాయి చరణ్, రవీందర్,షాదీబ్,దేవి ప్రసాద్,ఇర్ఫాన్ అలీ, శివప్రసాద్,మహమ్మద్ కాజా,గుండు రవీందర్, రాజశ్రీ,పద్మ,జ్యోతి, విజయలక్ష్మి, మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని మోడల్ స్కూల్లో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను వెంటనే బదిలీలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒకే పాఠశాలలో 11 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 8th ఇంటర్నేషనల్ కలకత్తా కరాట ఛాంపియన్ షిప్ 2024
## పాల్గొన్న మాస్టర్ సుదర్శన్ మునగనూరు కరాట విద్యార్థులు



ప్రజావినికిడి,(మునగనూరు): మునగనూరు,కరాట మాస్టర్ సుదర్శన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కరాటే పోటీలు కలకత్తాలో జరిగాయి కలకత్తాలో జరిగిన ఇంటర్నేషనల్ కరాట పోటీలలో మునుగనూరు చెందిన కరాట విద్యార్థులు పాల్గొన్నారు కరాట పోటీలలో బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం మాస్టర్ సుదర్శన్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ కరాట పోటీలలో మా విద్యార్థులు పాల్గొనడం చానా సంతోషంగా ఉందని బహుమతులు గెలుచుకోవడం విద్యార్థులను అభినందిస్తున్నానని మాస్టర్ తెలిపారు ప్రతి ఒక్క తల్లిదండ్రులు కరాటే ప్రోత్సహించాలని అన్నారు కలకత్తా ఇంటర్నేషనల్ కరాట పోటీలలో బహుమతులు గోల్డ్ సిల్వర్. బ్రౌన్స్. గెలుచుకున్న విద్యార్థులు లక్ష్మణ్. దిలీప్ రాజు విశ్లేష. రాఘవ్ భావేష్. ఆదిత్య. జోష్ణ.పవిత్ర గీత అద్విక్,విగ్నేష్. అమర్నాథ్,అథర్వ గుప్తా,అమన్,విక్రమ్, అరవ గుప్త. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## శభాష్ స్మైల్ టీమ్
## అంటున్న ప్రజలు అధికారులు





ప్రజావినికిడి, మేడ్చల్ జిల్లా :
తెలంగాణరాష్ట్రం మొత్తంలోనే అధికంగా మేడ్చల్ జోన్ లో బాల కార్మికల చేతఎట్టి చాకిరి చేయిస్తున్న యజమాలను అదుపులోకి తీసుకొని 96 కేసులు నమోదు చేయడం జరిగింది. మేడ్చల్ జోన్ లో స్మైల్ టీం సిబ్బంది 365 రోజులు డ్యూటీ చేస్తూ, చెత్త సేకరించే వీధి పిల్లలను, రోడ్లపై ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర భిక్షాటన చేసే అనాధ పిల్లలను, పెద్దపెద్ద అపార్ట్ మెంట్ల దగ్గర పనిచేస్తున్న పిల్లలను గుర్తించి సి డబ్ల్యూ సి( చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ):సహకారంతో వారిని రక్షించి బాల రక్షక హోం లో పెట్టి వారికి చదువు చెప్పించడం జరుగుతుంది ఆపరేషన్ ముస్కాన్ కన్నా ముందు రెండు నెలలుగా మేడ్చల్ జోన్ అంతటా నిఘ పెట్టిన రెగ్యులర్ స్మైల్ టీం,డిసిపి ఉమెన్ సేఫ్టీ వింగ్ సుజనా, ఐయూ ఆ హెచ్ టి యు ఇన్స్పెక్టర్ జేమ్స్ బాబు,స్మైల్ టీం అధికారి వెంకటగిరి,మేడ్చల్ జోన్ డివిజన్ ఇన్చార్జిగా ఎస్ఐ మల్లేష్ గౌడ్ సూరారం పోలీస్ స్టేషన్ పేట్ బషీర్బాగ్ డివిజన్ ఇంచార్జ్ ఎస్ఐ పరుశురాం శామీర్పేట్ పోలీస్ స్టేషన్ వీరి ఆధ్వర్యంలో ఏకకాలంలో భారీ ఎత్తున పిల్లలని కాపాడి యజమానులపై కేసులు పెట్టి బాల కార్మికులను రక్షించడం జరిగింది మేడ్చల్ డివిజన్లో 50 కేసులు నమోదు కాగా పేట్ బషీర్బాగ్ డివిజన్లో 46 కేసులు నమోదయ్యాయి, విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడి ఉన్న, వెనుకడుగు వేయకుండా యజమానులపై కేసులు నమోదు చేసిన పోలీస్ అధికారులను,స్మైల్ టీం సిబ్బందిని, ప్రజలు అభినందించారు, అలాగే సైబరాబాద్ కి మాత్రమే పరిమితమైన స్మైల్ టీం, రాష్ట్రమంతట ఉండాలని అప్పుడే బాల కార్మికులకు రక్షణ ఉంటుందని,ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారులు ఆలోచించాలని ప్రజలు కోరుకుంటున్నారు

## బ్రాహ్మణ సంక్షేమానికి మరిన్ని నిధులు కేటాయించాలి...

### జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు..



ప్రజావినికిడి, (మహేశ్వరం): ఆగస్టు 1 ప్రభుత్వం 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కు రూపాయలు 50 కోట్ల నిధులు ప్రకటించడం పట్ల బడంగ్పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మంగు రాఘవరావు హర్షం వ్యక్త చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం 100 కోట్లు కేటాయించిందని ప్రస్తుత ప్రభుత్వం దాన్ని రు 150 కోట్లు గాని లేదా రు 200 కోట్లు గాని పెంచితే బాగుండేది అన్నారు. ప్రస్తుతం కేటాయించిన 50 కోట్లు విదేశీ విద్య కోసం వివేకానంద ఓవర్సీస్ స్కిన్ ద్వారా విదేశీ విద్యకు వెళ్లిన విద్యార్థులకు బెస్ట్ స్కీం ద్వారా ఎంపికైన ఔత్సాహిక వ్యాపారస్తులకు ఈ నిధులు సరిపోకపోవచ్చు కావున వెంటనే ఇంకొక 100 కోట్ల రూపాయలను సంక్షేమ పరిషత్ కు విడుదల చేయాలని కోరుతున్నాను ప్రతి ఉమ్మడి పాత 10 జిల్లాలో ఒక బ్రాహ్మణ భవనం ఏర్పాటు చేయాలని ప్రతి పేద బ్రాహ్మణుడికి తెల్ల రేషన్ కార్డు అందజేయాలని ప్రతి దేవాలయం కమిటీలలో ఒక బ్రాహ్మణుడి తప్పనిసరిగా సభ్యునిగా ఉండేటట్లు చూడాలని బడంగ్పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మంగు రాఘవరావు ఒక ప్రకటన ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ని కోరడం జరిగింది. అదేవిధంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు వెంటనే జోక్యం చేసుకొని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ను పునర్నిర్మానం చేయాలని కోరారు.

# శంషాబాద్ కూరగాయల మార్కెట్ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న

# బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి...

## యువ నాయకుడు రాఘవేందర్ రెడ్డి...





ప్రజావినికిడి (శంషాబాద్): ఆగస్టు 1,
రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పరిధిలోని కూరగాయల మార్కెట్ లో యువ నాయకుడు రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీ. పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథిగా బోనాల ఉత్సవాలకు హాజరైన కార్తీక్ రెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్ సుభాష్ రెడ్డి, స్థానిక నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి గారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దయవల్ల రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలతో సిరి సంపదలతో అష్ట ఐశ్వర్యాలతో తలతూగాలని అమ్మవారిని ప్రార్థించారు. తధానంతరం మార్కెట్ కమిటీ సభ్యులు కార్తీక్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ బోనాల ఉత్సవాల కార్యక్రమంలో సీనియర్ నాయకులు చక్రధర్ రెడ్డి స్థానిక నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా భవనము ఏర్పాటు చేయాలని శంభీపూర్ క్రిష్ణకు వినతి...



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో గురువారం మల్లంపేట్ గ్రామానికి చెందిన మహిళలు వారికి డ్వాక్రా మహిళా భవనము ఏర్పాటు చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మల్లంపేట్ గ్రామంలో సుమారు 45 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని తెలుపుతూ ప్రతి గ్రూప్ కి పది మంది చొప్పున 450 మంది వరకు ఉన్నారని తెలియజేశారు. ఇందుకుగాను ప్రతి నెలవారు మీటింగ్స్ నిర్వహించుట కొరకు మరియు మీటింగ్స్ జరుపుటకు సరైన చోటు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయాన్ని వారికి తెలియజేశారు. క్రిష్ణ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ మహిళలు పార్వతి, జ్యోతి,వినోద, విజయలక్ష్మి, సంగీత, సంతోష, ప్రేమలత, కుమారి,నర్సమ్మ, ప్రియాంక,సత్యవతి, అమరావతి,శారద, అశ్విని,లక్ష్మి, కళావతి, ప్రభావతి,పుష్ప, మరియు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల విజయభేరి...

**దళిత ఐక్య కార్యాచరణ కమిటీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నాయకులు ..మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం...**





ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అంబేద్కర్ భవన్ లో మాదిగల చిరకాల ఆకాంక్ష ఏబిసిడి.. వర్గీకరన నెరవేర్చిన ఉద్యమాల వీరుడు సామాజిక పరివర్తలు మందకృష్ణ మాదిగ కు ధన్యవాదాలు జై బీములు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 30 ఏళ్ల ఆకాంక్ష ఏబిసిడి వర్గీకరణ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును స్వాగతిస్తూ దళితుల ఆత్మగౌరవం పెంచిన సామాజిక ఉద్యమ కారులు మాదిగ దండోరా కమిటీకి సామాజికవిప్లవ వందనములు ఎస్సీలలో 59 షెడ్యూల్ ఉప కులాల వారికి అన్నిరంగాల్లోఆర్థిక%శీ%గా,విద్యాపర%శీ%గా రాజకీయంగా అభివృద్ధి జరిగే విధంగా ఏబిసిడి వర్గీకరణ జరగడానికి సహకరించిన వివిధ రాష్ట్రాలనాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. దళిత ఐక్యకార్యచరణ కమిటీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నాయకులు గట్టు అశోక్, బూదాల విజయభాస్కర్ రావు ఆర్. సిద్దయ్య, ఏసురత్నం, మేకలఎల్లయ్య, కె.యాదగిరి, తిరుపతయ్య, జాన్ ,మంచింటి ఆంజనేయులు, కృపావరం ఆర్ కృష్ణ,యాదమ్మ,రాణి,స్వరూప, అనిల్ సమ్మయ్య ,బాలస్వామి దశరథ రాజు,దళిత నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి వివిధ రాష్ట్రాల నాయకులకు పాలాభిషేకం చేశారు.

# నిమ్స్ లో దారుణం

**: బతికుండగానే డెత్ సర్టిఫికెట్..!!**




ప్రజావినికిడి,(హైదరాబాద్):
ఓ వ్యక్తి చనిపోయాడని నిమ్స్ వైద్యులు డెత్ సర్టిఫికేట్ ఇచ్చారు. కానీ సొంత ఊరికి తీసుకెళ్తుండగా లేచి కూర్చున్నాడు. శ్రీను (50) గుండెకు సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం నిమ్స్ లో చేరారు. శస్త్ర చికిత్స చేస్తుండగా మరణించారని వైద్యులు ప్రకటించి డెత్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. అంబులెన్స్ లో స్వగ్రామం తీసుకు వెళ్తుండగా లేచి కూర్చున్నాడు. దీంతో వైద్యులపై అతని కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు.

# రషీద్ గూడను గ్రామ పంచాయతీగా కొనసాగించాలి...

## యువ నాయకుడు మంచాల సుధాకర్....



ప్రజావినికిడి (శంషాబాద్): ఆగస్టు 1
శంషాబాద్ మండల పరిధిలోని రషీదు గూడ, హామిదుల్లానగర్, చిన్నగోల్కొండ, బహుదూర్ గూడ గ్రామాలనుగ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేయకుండా గ్రామ పంచాయతీగా కొనసాగించాలని మంచాల సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో హామీదుల్లానగర్ గ్రామ పంచాయతీ నుండి వేరుపడి నూతనంగా రషీదుగూడ గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయడం జరిగింది. మండల పరిధిలోని రషీదు గూడ, హామిదుల్లానగర్, చిన్నగోల్కొండ, బహుదూర్ గూడ గ్రామాలను హైదరాబాద్ పాలక సంస్థ విలీనం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగు గ్రామ పంచాయతీలోని 5 వేల ఓట్ల కంటే తక్కువ ఉన్నారు. సగంపైగా భూములు వివాదంలో ఉన్నయి. రైతులు స్థానిక ప్రజలకు ఆదాయం పెద్దగా ఏమి లేదన్నారు.రోజు కూలీనాలి. వ్యవసాయం చేసుకొని బతుకుతున్నారు. గ్రామంలో సన్న కారు జీవితాలను గ్రేటర్లలో విలీనం చేస్తే ఇబ్బందులు వస్తాయని అన్నారు. ఒక వేళ గ్రేటర్లో గ్రామాలను కలిపిన గ్రామ ప్రజలు ఆదాయం పెరగకుండానే ఆదనపు భారాలు మోయాల్సి వస్తోందని అన్నారు. పరిపాలన భారం పెరుగుతుంది, కానీ ప్రజలకు స్థానిక సమస్యలు పరిష్కరించు కోవడానికి గ్రామ పంచాయతీ ముఖ్యమని అన్నారు. 111జీవో పరిధిలో ఉన్న ప్రతిపాదన గ్రేటర్లో విలీనం చేయకుండా చూడగలరని మంచాల సుధాకర్ కోరరు.

# ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని స్థాపించండి

**ఎంపీ అర్వింద్ తో కలిసి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కువిన్నవించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి**





నిజామాబాద్ ఆగస్టు1, ప్రజావినికిడి:
పెండింగ్ లో ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని తెలంగాణలో స్థాపించాలని, కేంద్ర జౌళి, టెక్స్ టైల్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ని, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ తో కలిసి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి కోరారు. గురువారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో భేటీ అయి చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఇక్కత్ డిజైన్లకు ప్రసిద్ధి అని, మార్కెట్లో అసలు ఇక్కత్ చీరలు రూ.8వేల ధర ఉంటుందని కానీ ప్రింటెడ్ ఇక్కత్ చీరలు కేవలం రూ.300 లకే లభించడంతో, చేనేత కార్మికుల జీవనోపాధి మీద తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి నేతన్నలకు భరోసా కల్పించడానికి ప్రింటెడ్ చీరల ఉత్పత్తి, విక్రయాల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ విధించినప్పటి నుండి నేతన్నలు అదనపు ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నారని చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించాలని ఆమె కోరారు. అదేవిధంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఇక్కత్ కళకు, గద్వాల్ చీరలకు, వరంగల్ దుర్రీలను ఉత్పత్తి చేసే అసాధారణ కళ తెలంగాణ నేతన్నల సొంతమని, కాబట్టి తెలంగాణలో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. అనంతరం బోగ శ్రావణి పోచంపల్లి శాలువాతో మంత్రికి సన్మానించారు. తెలంగాణ వచ్చినప్పుడు తప్పకుండా పోచంపల్లిని సందర్శిస్తానని, అదేవిధంగా విన్నపాల మీద తగు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ నేతన్నల తరపు నుండి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో మర్యాద పూర్వకంగా సమావేశమైన ఏపీ జితేందర్ రెడ్డి



ప్రజావినికిడి,(హైదరాబాద్:
తెలంగాణ రాష్ట్ర గవర్నరుగా ఇటీవల భాద్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా న్యూఢిల్లీకి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో గురువారం మర్యాద పూర్వకంగా సమావేశమైన ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి. గవర్నరుగా బాధ్యతలు చేపట్టిన సంధర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి.తెలంగాణ భవన్ రెసిడెంట్ కమీషనర్ డా.గౌరవ్ ఉప్పల్, టీపీసీసీ స్పోక్స్ పర్సన్ హర్షవర్ధన్ రెడ్డి కూడా ఉన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి

**- టికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల వెంకట సాయిలు**



రాయపర్తి, ఆగస్టు1, ప్రజావినికిడి: రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ కార్మిక సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల వెంకట సాయిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సంఘటిత, అసంఘటిత కార్మికులకు, నిరుపేదలకు గృహలక్ష్మి పథకం అందించాలని కోరారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు కట్టించాలని అన్నారు. విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఇండ్లు లేని నిరుపేదలు నిస్సహాయులు అయ్యారని పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం అమలు చేసి, నిరుపేదలకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలో నిరుపేదల పక్షాన తెలంగాణ కార్మిక సమైక్య పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# ఎస్‌సి వర్గీకరణ అందరికంటే ముందే తెలంగాణలో అమలు చేస్తాం

**: రేవంత్ రెడ్డి**



హైదరాబాద్: ఆగస్టు1, ప్రజావినికిడి:
ఎస్‌సి వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాల యువకులు 27 ఏళ్లుగా పోరాటం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణ కోసం తాను, సంపత్ వాయిదా తీర్మానం కూడా ఇచ్చామని, వాయిదా తీర్మానాన్ని ఇచ్చిన మమ్మల్ని సభ నుంచి బహిష్కరించారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శాసన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. గత ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ అంశంపై ప్రధాని నరేంద్ర మోడీ వద్దకు అఖిలపక్షం తీసుకెళ్తామని చెప్పిందని, కానీ కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకుపోకుండా మోసం చేసిందని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టులో ఎస్‌సి వర్గీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించిందన్నారు. ఎస్‌సి వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ప్రశంసించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దేశంలోనే అందరికంటే ముందే ఎస్‌సి వర్గీకరణను తెలంగాణలో అమలు చేస్తామని, ఇప్పుడిచ్చిన నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పుడిచ్చిన నోటిఫికేషన్లలో ఆర్డినెన్స్ తీసుకువచ్చి మాదిగ సోదరులకు న్యాయం చేయడంతో పాటు ఎస్‌సి వర్గీకరణకు సంపూర్ణంగా సహకరించాలని సభను కోరుతున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు.

# ఆందోళన కలిగిస్తున్న అత్యాచార ఘటనలు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన**



హైదరాబాద్, ఆగస్టు1 ప్రజావినికిడి:
తెలంగాణ రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక చోట చోటు చేసుకుంటున్న అత్యాచార ఘటనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా రాష్ట్రానికి హోం మంత్రి లేకపోవడం దారుణమని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అత్యాచార ఘటనలను తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కేవలం 48 గంటల్లోనే నాలుగు చోట్ల సామూహిక అత్యాచారాలు చోటు చేసుకోవడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. మహిళలకు భద్రత లేకపోవడం కారణంగానే ఈ క్రూరమైన చర్యలకు దుండగులు పాల్పడుతున్నారు. ఈ వరుస ఘటనలు రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతలను ఎత్తి చూపిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ, ఒక హోం మంత్రి లేకపోవడం దారుణం. హోంమంత్రి లేకపోవడం కారణంగా నేరాల సంఖ్య పెరిగిపోతుందన్నారు. వనస్థలిపురం, శాలిగౌరారం, నిర్మల్, పుప్పాలగూడలో జరిగిన ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# టోల్‌ప్లాజా వద్ద రెండున్నర కోట్ల బంగారం పట్టివేత

నల్లగొండ ఆగస్టు1 ప్రజావినికిడి:
కేటుగాళ్లు రోజుకింత రాటుదేలుతున్నారు. పోలీసులను మస్కా కొట్టించి మరీ స్మగ్లింగ్ చేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా చట్ట వ్యతిరేక పనులు చేసేస్తున్నారు. కానీ ఎక్కడో ఓచోట దొరికి పోతున్నారు. తాజా ఘటనలో అదే జరిగింది. ఖాకీల తెలివి ముందు.. యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్‌గేట్ వద్ద భారీగా బంగారం పట్టుబడింది. రూ. 2.51 కోట్ల విలువైన బంగారాన్ని డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు. చెన్నై నుంచి కారులో అక్రమంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. బంగారం, కారు సీజ్ చేయడంతో పాటు.. కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు డీఆర్ఐ

# ఝాన్సీ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసిన కాంగ్రెస్ నాయకులు



రాయపర్తి, ఆగస్టు1, ప్రజావినికిడి:
అమెరికాలో ప్రముఖ సభకు వెళ్తున్న శుభ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ హనుమండ్ల ఝాన్సీ రెడ్డిని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో పిఎసిఎస్ చైర్మన్ తొర్రూర్, వరంగల్ డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమండ్ల తిరుపతిరెడ్డి, ఎస్ఆర్ఆర్ ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత పరుపాటి శ్రీనివాసరెడ్డి, కుమారస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పాలు బిడ్డలకు ఎంతో శ్రేయస్కరం



నర్సంపేట, ఆగస్టు1 ప్రజావినికిడి: తల్లిపాలు తాగడం ఎంతో శ్రేయస్కరమని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రకాష్ అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో తల్లులను సమావేశపరిచి, తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రసవం తర్వాత అరగంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, తద్వారా వ్యాధి నిరోధక శక్తి మెండుగా ఉంటుందని తెలియజేశారు. తల్లిపాలు బిడ్డకు పట్టడం వల్ల నీళ్ల విరోచనాలు, శ్వాస కోశ వ్యాధులు రాకుండా కాపాడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వింధ్య, మార్త ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ సన్నాహక సమావేశం

**- ముఖ్య అతిథులుగా హాజరైన కేఆర్ దిలీప్ రాజు**



పర్వతగిరి, ఆగస్టు1 ప్రజావినికిడి: పర్వతగిరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం యువజన కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా కేఆర్ దిలీప్ రాజు హాజరైనారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు గత ఎన్నికల్లో ఎంతో కష్టపడి పార్టీని గెలిపించారని అన్నారు. యువత రాజకీయాల్లో ముందు వరసలో ఉండే విధంగా జాగ్రత్త పడాలన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు అనేక అవకాశాలు ఇచ్చి, పదవులు నిలబెడుతున్నారని దిలీప్ రాజ్ చెప్పారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో యువత కాంగ్రెస్ పార్టీ ఇచ్చే అవకాశాలను చదివిందియోగం చేసుకునేలా ప్రయత్నాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, 33 గ్రామాల పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, గ్రామశాఖ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జడ్పీ కోఆప్షన్ మాజీ అధ్యక్షులు ఎండి సర్వర్, ఎస్టీసెల్ అధ్యక్షులు భాస్కర్, టౌన్ అధ్యక్షులు కుసం రామచందర్, పిన్నింటి సునీల్ రావు, యూత్ నాయకులు కందికట్ల అనిల్, సురేందర్, ఓరుగంటి శ్రీనివాస్, పోకల శంకర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు వేగవంతంగా చర్యలు చేపట్టాలి

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**



వరంగల్ బ్యూరో, ఆగస్టు1 ప్రజావినికిడి:
ఇన్నర్ రింగ్ రోడ్ భూ నిర్వాసితుల పరిహారం చెల్లింపుకువేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఈనగాల వెంకట్రామి రెడ్డి, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి ఇన్నర్ రింగ్ రోడ్ కొరకు భూములు తీసుకొన్న రైతులకు పరిహారం చెల్లింపు, క్రీడానగరం ఏర్పాటుకు భూగుర్తింపుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూములు ఇచ్చినతిమ్మాపూర్, ఖిలా వరంగల్, గొర్రెకుంట ఏనుమాముల రైతులకు త్వరితంగా పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరంగల్ స్పోర్ట్స్ స్టేడియం, క్రీడా నగరం ఏర్పాటు చేయుటకు నగర పరిసరాల్లో 50 నుండి 100 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆర్డిఓకు సూచించారు. కూడా చైర్మన్ ఈనగాల వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ వరంగల్ కొరకు స్పోర్ట్స్ స్టేడియం ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. అదేవిధంగా వరంగల్ నగరం పరిసరాల్లో క్రీడా నగర్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, కుడా పిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్రావు, కలెక్టరేట్ సూపరిన్టెండెంట్ చంద్రశేఖర్, తహశీల్దార్లు నాగేశ్వరరావు, రియాజుద్దీన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం


**కలెక్టర్లకు దిశానిర్దేశం చేసిన సిఎస్ శాంతికుమారి**





హైదరాబాద్, ఆగస్టు1 ప్రజావినికిడి:
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించాలని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉన్న మౌళిక సమస్యలను పరిష్కరించా లన్నారు. స్వచ్ఛదనం ? పచ్చదనం కార్యక్రమ నిర్వహణ పై గురువారం అన్ని జిల్లా కలెక్టర్లతో సీఎస్ సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. స్వచ్ఛదనం ? పచ్చదనం కార్యక్రమం ద్వారా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడమే కాకుండా అవి మనుగడ సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్లలె ప్రకృతి వనాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులతో పాటు ఇతర వనాల నిర్వహణ సరిగా ఉండేలా చూడాలన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఏవైనా ఎండిపోయి ఉంటే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు అరికట్టే చర్యలు, ఇంకుడు గుంతల నిర్వహణ, కొత్త ఇంకుడు గుంతల ఏర్పాట్లపై అధికారులు శ్రద్ద వహించాలన్నారు. ఇంకుడు గుంతల అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో రోజుకో ప్రత్యేకత ఉండేలా ప్రణాళిక రూపొందించి వాటి వివరాలను ఇప్పటికే కలెక్టర్లకు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 5న ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించడం, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అధికారులు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని మన రాష్ట్రంలో చాలా మంది కలెక్టర్లు యువకులే ఉన్నారని వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సీఎస్ సూచించారు. ప్రతి గ్రామంలో చురుకుగా ఉన్న యువజనల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ శాఖ కమిషనర్ వీపీ గౌతమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 35 - చిన్న కథ కాదు'.. గ్లింప్స్ రిలీజ్




నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్ '35 – చిన్న కథ కాదు'. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్దార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని దర్శకుడు. తాజాగా ఈ సినిమా నుంచి మొండి గురువు ఓ. చాణక్య వర్మకి సంబంధించిన 35 సెకెన్ల గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాలో నటుడు ప్రియదర్శి ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. గణిత ఉపాధ్యాయుడి పాత్రలో దర్శి కనిపిస్తున్న వీడియో ఆకట్టుకుంటోంది. ఆయన మొండితనం, క్రమ శిక్షణలో చూపెట్టే నేర్పరితనం ఈ గ్లింప్స్‌లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి.
తిరుపతి నేపథ్యంలో జరిగే ఈ కథలో నివేదా థామస్ తల్లి పాత్ర పోషించారు. పరీక్షల్లో కనీసం పాస్ మార్కులు రానందుకు తండ్రి మందలించగా..కొడుకు అలిగి ఇంటి నుంచి వెళ్లిపోవడం.. అతడి కోసం తల్లి ఆరాటపడడం తదితర అంశాలతో ఈ సినిమా రూపొందింది. ఇదివరకే ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్ ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా చేసింది. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఆగస్ట్ 15న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సీతకు ప్రముఖుల బర్త్‌డే విషెస్




సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైంది మృణాల్ ఠాకూర్. ఈ చిత్రంతో ఇతర భాషల్లోనూ మంచి గుర్తింపును అందుకుంది. హను రాఘవపూడి తెరకెక్కించిన ఈ మూవీలో మృణాల్ తనలోని హావాభావాలకు తిరుగేలేదు. తనలోని అందానికి కొదువలేదు. ఇక నటనలో నిజాయితీకి తగ్గేదేలేదు. ఇది మృణాల్ ఏర్పరుచుకున్న సిగ్నేచర్. ఆగస్ట్ 1న తన పుట్టిన రోజున సందర్భంగా పలు సినీ ప్రముఖుల నుండి విషెష్ అందుతున్నాయి. ఈ అమ్మడు తెలుగులో ఎన్ని సినిమాల్లో నటించిన సీతా రామం తర్వాతే ఏదైనా అనేలా సినీ అభిమానుల్లో ఓ మార్క్ క్రియేట్ చేసింది. ఎంతలా అంటే ఈ సినిమాలో దుల్కర్ చెప్పే డైలాగ్ ఉంటుంది చూశారా..' కురుక్షేత్రంలో రావణ సంహారం..యుద్ధపు వెలుగులో సీతా స్వయంవరం అంటూ పలికిన డైలాగ్స్..ఎంతో అర్థాన్ని తెలియాజేశాయి. ఈ మూవీలో లెటర్స్ తో.. సీత, రాముడి డైలాగ్స్ మెస్మరైజ్ చేస్తూ..ఒక్కసారిగా క్లైమాక్స్ తో అందరికి కళ్ళలో కంటనీరు వచ్చేలా దుల్కర్, మృణాల్ నటించారు .దీంతో మృణాల్ టాలీవుడ్ లో మంచి గుర్తింపు పొందారు. ఇక ఈ మూవీలో లెఫ్టినెంట్ రామ్‌గా దుల్కర్ నటించగా.. సీతగా, నూర్జహాన్ గా మృణాళ్ సహజన నటనను కనబరిచింది. ఈ మూవీని థియేటర్లో చూసిన ఆడియన్స్ ప్రతి ఒక్కరిని కదిలించింది. సీతగా తాను నటించిన పాత్ర అందరి గుండెలను హత్తుకుంది. అందుకే సీతగా నటించిన మృణాల్ స్థానం తెలుగు ఆడియన్స్ మనసుల్లో ఎప్పటికీ పదిలం. ఇక మృణాల్ ఠాకూర్ సినిమాల విషయానికి వస్తే..స్టార్ హీరోయిన్‌గా పేరు సొంతం చేసుకున్న ఆమె ప్రస్తుతం దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ వరుస చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నారు. ది ఫ్యామిలీ స్టార్ తరువాత కల్కి లో ఓ చిన్న పాత్రలో కనిపించింది. ఆ మధ్య చిరంజీవి హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ విశ్వంభరలో నటించనుంది అనే వార్తలు వచ్చాయి కానీ, ఆ విషయం మాత్రం ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ రాలేదు. మహారాష్ట్రకు చెందిన మృణాల్..కెరీర్ స్టార్టింగ్ లో టెలివిజన్ నటిగా ఎంట్రీ ఇచ్చారు. ఇక ఆపై పలు హిందీ సీరియల్స్‌లో యాక్ట్ చేసి గుర్తింపు పొందింది.



# ప్రతిభ నిరూపించుకునే పాత్ర అది : మేఘా ఆకాశ్

విజయ్ ఆంటోనీ హీరోగా విజయ్ మిల్టన్ దర్శకత్వం వహించిన 'మళై పిడిక్కాద మనిదన్' (తెలుగులో తుఫాన్) చిత్రంలో తన పాత్ర అద్భుతంగా ఉంటుందని, ఇది తన సినీ కెరీర్‌కు ఓ టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందని ఆ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన మేఘా ఆకాష్ అభిప్రాయ పడింది. ఈ సినిమాలో తన పాత్ర గురించి ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'సాధారణంగా విజయ్ మిల్టన్ రూపొందించే సినిమాల్లో హీరోయిన్ పాత్ర ఎంతో బలంగా ఉంటుంది. ఈ సినిమాకు నన్ను సంప్రదించకముందే, స్టోరీ వినకముందే నా మనసులో ఒక బలమైన ముద్ర పడింది. ఖచ్చితంగా ఈ సినిమాల్లో నా పాత్ర బాగా ఉంటుందని ఊహించాను. నేను అనుకున్నట్టుగానే సినిమాలో మంచి పాత్ర లభించింది. ప్రతిభ నిరూపించుకునేందుకు ఓ మంచి అవకాశంగా భావిస్తున్నాను. ఈ సినిమా షూటింగ్ మొత్తం మరిచిపోలేని ఎన్నో అనుభూతులు మిగిలాయి. ఈ మంచి అవకాశాన్ని ఇచ్చిన చిత్ర బృందానికి ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.



# అభిమానుల కోరిక.. సెల్ఫీ ఇచ్చిన మహేశ్ బాబు

మహేష్ బాబు…ఈ పేరు వెనుకాల ఓ వైవిధ్యమైన నటుడితో పాటు..ఓ సామజిక సేవకుడు ఉన్నాడు. ఎంతోమంది చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్స్ చేపిస్తూ ఎంతో మందికి దేవుడయ్యాడు. దీంతో మహేష్ కు సినీ ప్రేక్షకులతో పాటు సమాజంలో కూడా చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. ఈ నేపథ్యంలో మహేష్ బాబు ఓ స్టూడియోకి వెళ్లగా అక్కడ పలువురు అభిమానులు ప్రిన్స్ తో సెల్ఫీల దిగడం కోసం ఎగబడ్డారు. పలువురికి మహేష్ సెల్ఫీలు ఇస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఓ పోలీస్ కూడా దగ్గరికి వచ్చి సెల్ఫీ కోరగా..వెంటనే మహేష్ బాబు ఆయనకు సెల్ఫీ ఇచ్చాడు. ఇంకొంత మంది దూరం నుంచే ఫొటోస్ తీసుకోవడానికి ప్రయత్నించారు. దీంతో మహేష్ బాబు లేటెస్ట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ సంక్రాంతికి 'గుంటూరు కారం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన మహేష్ బాబు.. తన తర్వాతి సినిమా రాజమౌళి డైరెక్షన్‌లో చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఎప్పుడెప్పుడు షూటింగ్ మొదలవుతుందా అని ఎదురు చూస్తున్నారు మహేష్ ఫ్యాన్స్. ఈలోపు ఆయన కొత్త లుక్‌తో అభిమానులను ఖుషీ చేశాడు. ఈ సినిమా కోసం మహేష్ సరికొత్తగా మేకోవర్ అవుతున్నట్టు తెలుస్తోంది. లాంగ్ హెయిర్‌తో కనిపిస్తున్న మహేష్.. మీసాలు పెంచి, లైట్ గడ్డంతో ఫిట్‌గా ఉన్నాడు. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఆగస్టు 9 మహేష్ పుట్టినరోజున ఈ చిత్ర విశేషాలను తెలియజేసేలా రాజమౌళి ఎ÷-లాన్ చేస్తున్నారట. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూపొందించాలని, అన్ని అనుకున్నట్టు జరిగితే ఫస్ట్ పార్ట్‌ను 2026 లో రిలీజ్ చేయాలనుకుంటున్నారట. ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613